## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



hindustanmedia333@gmail.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం



బాలాజీ మిల్క్ ఏజెన్సీ
NSR DAIRY The Trust of Purity
చేర్యాల
మా వద్ద వివాహాది శుభకార్యాలకు పాలు, పెరుగు బకెట్లు, పన్నీర్, ఐస్ క్రీం మొ. నవి ఆర్డర్ పై సప్లై చేయబడును.
పాలు (NSR) పెరుగు బకెట్లు పన్నీర్ ఐస్ క్రీం NSR పెరుగు
NSR పాలు, పాల పదార్థాలు
CONT: 9666464085



ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 61 సోమవారం 29 జూన్ 2026 పేజీలు - 4 వెల :2/-


## పూటకో పార్టీ పేరు మార్చుకునే మీరు మమ్మల్ని విమర్శిస్తారా: మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, జూన్ 28:

'మొన్న టీఆర్ఎస్, నిన్న బీఆర్ఎస్.. ఇలా పూటకో పార్టీ పేరు మార్చుకునే మీరు మమ్మల్ని విమర్శిస్తారా?' అంటూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో మంత్రి కోమటి రెడ్డి.. బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర అభివృద్ధి, గత పాలనలో జరిగిన అవినీతి, ప్రస్తుత ప్రాజెక్టుల పురోగతి వంటి అంశాలపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బయటికి వెళ్లిన ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి తిరిగి రావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 13 వేల కోట్ల రూపాయలతో హ్యామ్ రోడ్లను నిర్మిస్తోందని ఆయన తెలిపారు. అభివృద్ధి పనులను ఉద్దేశించి విమర్శలు చేసే వారిపై ఆయన విమర్శలు గుప్పించారు. పచ్చ కామెర్లు ఉన్న వారికి లోకం అంతా పచ్చగానే కనిపిస్తుందని వ్యాఖ్యానిస్తూ ప్రతిపక్షాలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాళేశ్వరం, ధరణి వంటి పేర్లతో గతంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించినమంత్రికోమటిరెడ్డి..రాష్ట్రవనరులు దుర్వినియోగం అయ్యాయన్నారు.



తరచూపార్టీలు మారుతూలవిమర్శలు చేసే వారికే తాము సమాధానం చెప్పాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు విషయంపైనా ఆయన స్పందించారు. కుర్చీ వేసుకుని సొరంగం పూర్తి చేస్తానని గతంలో చెప్పిన కేసీఆర్.. ఆ మాటను నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. పనుల సమయంలో జరిగిన ప్రమాదాల్లో కార్మికుల మరణాలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. అయితే ప్రభుత్వం కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకుందని, 2028 ఆగస్టు నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేసి 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన పనులకు అడ్డుపడుతున్నారని పేర్కొంటూ కేటీఆర్, కేసీఆర్, కిషన్ రెడ్డిలపై ఆయన విమర్శలు చేశారు. నకిరేకల్‌లో ప్రవహించే మురికి మూసీని వారు స్వయంగా చూడాలని సూచించారు.

## వరి పండించడంలో.. కొనడంలో దేశంలోనే నంబర్ వన్ మనమే: మంత్రి ఉత్తమ్ కుమార్

నల్లగొండ, జూన్ 28:



వరి పండించడంలో.. ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ నంబర్‌వన్ అని అన్నారు పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తెలంగాణ దేశంలోనే అత్యధిక వరి ధాన్యాన్ని పండించి రైతుల నుంచి కొనుగోలు చేసిన రాష్ట్రంగా నిలిచిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నల్లగొండలో మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ధాన్యం కొను గోళ్లను పారదర్శకంగా నిర్వహించిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో నల్లగొండ మొదటి స్థానంలో నిలవడం జిల్లాలోని రైతుల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. నల్లగొండలో ఓ నేత ధాన్యం కుప్పల వద్దకు వెళ్లి రాజకీయాలు చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా ఆలోచించకుండా రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు చేస్తున్నారని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల గురించి ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ, దిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే నల్లగొండతో పాటు పరిసర ప్రాంతాల్లోని లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## త్యాగం అంటే కేవలం ఎలక్షన్, సెలక్షన్, కలెక్షన్

# బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ ధ్వజం

నల్లగొండ, జూన్ 28:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బహిరంగ సభలో మాట్లాడుతూ.. భారత్ రాష్ట్ర సమితి పార్టీపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ నిఘంటువులో త్యాగం అంటే కేవలం ఎలక్షన్, సెలక్షన్, కలెక్షనేనని ఎద్దేవా చేశారు. వేలాది మంది అమరవీరుల బలిదానాల పునాదుల పై ఏర్పడిన తెలంగాణను, బీఆర్ఎస్ నేతలు తమ సొంత ఖాతాలో వేసుకోవాలని చూడటం హాస్యాస్ప దమ న్నారు. నిజమైన త్యాగానికి అర్థం కాంగ్రెస్ నేతల్లోనూ, ఉద్యమకారుల్లోనూ కనిపిస్తోందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వందేళ్లకు సరిపడే విధ్వంసం సృష్టించిందని, అధికారం కోల్పోయామనే అక్కసుతో కేసీఆర్ కుటుంబం ఇప్పుడు రాష్ట్రంపై విషం చిమ్ముతోందని సీఎం ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు, తమ ముప్పై నెలల కాంగ్రెస్ పాలనకు మధ్య బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. స్పీకర్‌కు లేఖ రాసి, ఇరు పార్టీల మేనిఫెస్టోలపై సభలోనే ముఖాముఖి నిర్వహి ద్దామనిపిలుపునిచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి 4 కోట్ల మంది ప్రజల ఆశీర్వాదం ఉందన్న సీఎం రేవంత్. 30 నెలల కాలం లోనే పేదల సంక్షేమం కోసం లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో పేదలందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్ లో ఉన్న కేసీఆర్ తింటున్నది, తెలంగాణలోని తండాల్లో ఉన్న పేదలు తింటున్నది ఒకే బియ్యమే అన్నారు. అనుమానం ఉంటే కేటీఆర్.. తండాలకు వెళ్లి చూసు కోవచ్చని హితవు పలికారు. అలాగే, మహిళల కష్టాలను తీరుస్తూ కేవలం రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అంది స్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని రేవంత్ రెడ్డి గర్వంగా ప్రకటించారు. కేసీఆర్ కుటుం బానికి



మళ్లీ పదవులు ఇచ్చేందుకు తెలంగాణ ప్రజలు ఏమాత్రం సిద్ధంగా లేరని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. త్యాగానికి అసలైన నిర్వచనం చెప్పాలంటే 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్న కొండా లక్ష్మణ్ బాపూజీని గుర్తుచే సుకోవాలన్నారు. అలాగే మలిదశ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం తన పదవిని త్యాగం చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిది అసలైన త్యాగమని కొనియాడారు.

## తెలంగాణ నూతన సీఎస్ కు చిరంజీవి శుభాకాంక్షలు

జూన్ 28:



ఆయన పాలనలో తెలంగాణ ఉన్నత శిఖరాలకు చేరుకుం టుందని ఆశాభావం

తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ)గా నియమితులైన సంజయ్ జాజుకు మెగాస్టార్ చిరంజీవి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు సమర్థతను, వ్యక్తిత్వాన్ని ప్రశంసిస్తూ చిరంజీవి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "ప్రియమైన సంజయ్ జాజు గారికి, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైనందుకు నా హృదయపూర్వక అభినందనలు. మీ నిజాయితీ, దార్శనికత, అపారమైన అనుభవం మిమ్మల్ని ఈ పదవికి సరైన నాయకుడిగా నిలబెట్టాయి. మీ పరిపాలనా నాయకత్వంలో తెలంగాణ మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందని నేను విశ్వసిస్తున్నాను" అని చిరంజీవి పేర్కొన్నారు. సంజయ్ జాజుతో తనకున్న వ్యక్తిగత సాన్నిహిత్యం గురించి ప్రస్తావిస్తూ, "నాకు మీరు స్నేహితుడి కన్నా సోదరుడితో సమానం. ఈ ప్రతిష్టాత్మక బాధ్యతలో మీరు పూర్తి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. మీకు ఎల్లప్పుడూ నా శుభాకాంక్షలు ఉంటాయి" అని చిరంజీవి తన సందేశంలో తెలిపారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన సంజయ్ జాజు, తెలంగాణ నూతన సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు.

## మేక, గాడిద పాలు ఆరోగ్యానికి శ్రేష్ఠమన్న పార్థసారథి

-ఆదోనిలో ఎమ్మెల్యే పార్థసారథి వినూత్న పర్యటన
-వీధిలో అమ్ముతున్న గాడిద పాలు కొని తాగిన వైనం
-స్వయంగా మేక పాలు పితికి అక్కడే సేవించిన ఎమ్మెల్యే



కర్నూలు జిల్లా ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి తన నియోజకవర్గ పర్యటనలో అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రజల సమస్యలు తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా ఆయన వీధిలో విక్రయిస్తున్న గాడిద పాలు, మేక పాలు తాగి వార్తల్లో నిలిచారు. 'ప్రజల కోసం మీ ఎమ్మెల్యే' పేరుతో పార్థసారథి పట్టణంలోని వివిధ కాలనీల్లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో అరుణ్ జ్యోతి నగర్‌లో పర్యటిస్తుండగా, గాడిద పాలు అమ్ముతున్న ఒక వ్యక్తిని చూసి ఆప్యాయంగా పలకరించారు. అతని వ్యాపారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అతని వద్ద గాడిద పాలను కొనుగోలు చేసి అక్కడికక్కడే తాగారు. ఆ తర్వాత మహాత్మా గాంధీ నగర్‌లో పర్యటిస్తున్నప్పుడు, మేకల కాపరి శివన్నను చూసి ఆయన వద్దకు వెళ్లారు. అతని జీవన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తానే స్వయంగా ఒక మేక పాలు పితికి తాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. "గాడిద, మేక పాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ పాలు తాగితే శరీరంలోని అవయవాలు శుద్ధి అవుతాయని చెబుతున్నారు. ఇంటింటికీ తిరుగుతూ పాలు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్న ఈ యువకుడిని అభినందిస్తున్నాను" అని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునే పర్యటనలో ఎమ్మెల్యే ఇలా సామాన్యులతో కలిసిపోవడం స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది.

## పీవీ నరసింహారావుకు కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ ఘన నివాళులు

హైదరాబాద్, జూన్ 28

భారత మాజీ ప్రధాని, భారతరత్న పాములపర్తి వెంకట నరసింహారావు జయంతి నేడు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు.. పీవీకి ఘన నివాళులు అర్పించారు.

### ఆర్థిక సంస్కరణలకు ఊతమిచ్చారు: కేసీఆర్

ఆర్థిక సంస్కరణలకు ఊతమిచ్చి, భారతదేశాన్ని ప్రగతిపథంలో నడిపించిన తెలంగాణ ముద్దుబిడ్డ, బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పిస్తున్నానని మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమంలో కేసీఆర్ పోస్టు పెట్టారు. దేశానికి అమూల్యమైన సేవలను పీవీ అందించారు: హరీశ్‌రావు తెలంగాణ గర్వించే బిడ్డగా, అత్యుత్తమ పరిపాలనాదక్షుడిగా, భారత ప్రధానిగా దేశానికి అమూల్యమైన సేవలను భారతరత్న పీవీ నరసింహారావుఅందించారనిమాజీమంత్రి హరీశ్‌రావు కొనియాడారు. పీవీ జయంతి సందర్భంగా వారి సేవలను స్మరించుకుంటూ నివాళి అర్పిస్తున్నానని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమంలో హరీశ్‌రావు పోస్టు పెట్టారు.

### దేశాన్ని భారీ ఆర్థిక సంక్షోభం నుంచి పీవీ గట్టెక్కించారు: కేటీఆర్



ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, బహుభాషా కోవిదుడు, రాజనీతి జ్ఞుడు భారతరత్న పీవీ నరసింహారావు అని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యా నించారు. గడ్డు కాలంలో దేశాన్ని భారీ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించారని కొనియాడారు. ఆయన తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణమని తెలిపారు. తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ హయాంలో ఎంతో ఘనంగా నిర్వహించామని ప్రస్తావి ంచారు. వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టామని చెప్పుకొచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమంలో కేటీఆర్ పోస్టు పెట్టారు. నెక్లెస్ రోడ్డుకు పీవీ మార్గ్ అని పేరు పెట్టడమే కాకుండా.. పీవీ అజరామర కీర్తిని చాటిచెప్పే విధంగా వారి ఎత్తయిన విగ్రహాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కేటీఆర్ తెలిపారు. అనేక ఆర్థిక సంస్కరణల ద్వారా ప్రధానంగా దేశ ప్రగతిని ముందుకు నడిపించిన తత్వవేత్త పీవీ అని కొనియాడారు. అనేక భాషల్లో అనర్గళంగా మాట్లా డగల బహుభాషా పండితుడని తెలిపారు. ఎన్ని అడ్డం కులనైనా సునాయాసంగా అధిగమించిన జ్ఞాన గని, సాటిలేని చాణక్యుడు పీవీ అని కేటీఆర్ అభి వర్ణించారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

**-5 ఏళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి: సర్పంచ్ బొల్లం భాగ్యలక్ష్మి**



చిన్నకోడూరు, జూన్ 28 (హిందుస్థాన్ మీడియా):

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిధిలోని రామునిపట్ల, గోనేపల్లి, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు చిన్నారులకు ప్రత్యేక బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా రామునిపట్ల గ్రామ సర్పంచ్ బొల్లం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. అలాగే, ఏవైనా కారణాల వల్ల ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులకు వచ్చే రెండు రోజుల పాటు ప్రత్యేక వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బి. చంద్రం, ఏఎన్ఎం మంజుల, ఆశా కార్యకర్త లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సత్తవ్వ, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు బీమా కల్పించడం హర్షనీయం

**-మహమ్మద్ అల్లావుద్దీన్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు**




కామారెడ్డి , జూన్ 28(హిందూస్థాన్ మీడియా),

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో, కార్పొరేషన్లు, సొసైటీలలో, స్థానిక సంస్థలలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు బీమా పథకాన్ని వర్తింపచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ఉప అధ్యక్షుడు అరుణ్ కుమార్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అల్లావుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప అధ్యక్షుడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న వేలాది మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు 60 లక్షల వరకు భీమా రక్షణ లభించనుండడం వారి కుటుంబాలకు భరోసానిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగి ఏదైనా అనుకోని ప్రమాదానికి గురైన సమయంలో కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత కల్పించి ఈ పథకం సామాజిక భద్రతకు నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కీలక పాత్ర పోషించినప్పటికీ గతంలో అనేక సంక్షేమ పథకాలకు దూరంగా ఉండేవారని ప్రస్తుతం ప్రభుత్వం వారిని బీమా పరిధిలోకి తీసుకురావడం అభినందనీయమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువేయడంలో కార్యాలయ వేలకు మించి ఎక్కువ సమయం కేటాయిస్తూ పని పరంగా ప్రతి ఒక్క ఔట్సోర్సింగ్ ఉద్యోగి గ్రామస్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు కష్టపడుతున్నారని పేర్కొన్నారు. కావున తక్షణమే ప్రభుత్వం ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పే స్కేల్ ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీమా పథకంపై ఇది గొప్ప సామాజిక భద్రత చర్య అని జేఏసీ కమిటీ వారన్నారు.

# వృద్ధ రిక్షా కార్మికుడు ఆత్మహత్య!

చేర్యాల (హిందూస్థాన్ మీడియా):

చేర్యాల పట్టణ కేంద్రంలో ఆదివారం ఒక రిక్షా కార్మికుడి ఆత్మహత్య ఘటన తీవ్ర కలకలాన్ని, పెను విషాదాన్ని నింపింది. వృద్ధాప్యంలోనూ ఎవరిపైనా ఆధారపడకుండా, కష్టాన్నే నమ్ముకుని రిక్షా నడుపుతూ జీవించిన ఆ కార్మికుడు.. అనారోగ్యం కారణంగా ఇకపై తాను రిక్షా నడపలేననే ఆవేదనతో ఉరివేసుకొని తనువు చాలించాడు.

**-కష్టాన్నే నమ్ముకున్న శ్రామికుడు..**

కుటుంబ సభ్యులు మరియు చేర్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన బస్వరాజు రాజయ్య (70) వృత్తిరీత్యా రిక్షా కార్మికుడు. ఈ వయస్సులోనూ ఆయన నిరంతరం చేర్యాల పట్టణ వీధుల్లో రిక్షా నడుపుతూ, వచ్చిన కొద్దిపాటి ఆదాయంతోనే తన కుటుంబాన్ని ఎంతో గౌరవప్రదంగా పోషిస్తున్నాడు. అయితే, గత కొద్దిరోజులుగా రాజయ్య తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు.



**-పని చేయవద్దనడంతో తీవ్ర వేదన:**

రాజయ్య ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్యులు.. వయస్సు పైబడటం వల్ల ఇకపై రిక్షా నడపడం వంటి కష్టమైన పనులు చేయవద్దని, ఇంట్లోనే ఉంటూ పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని స్పష్టం చేశారు. కష్టపడి బతకడమే తప్ప, ఒకరిపై ఆధారపడి జీవించడం తెలియని ఆ వృద్ధ రిక్షా కార్మికుడు తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. ఇంట్లో ఖాళీగా కూర్చుని కుటుంబానికి భారంగా మారకూడదనే తీవ్ర మనస్తాపంతో రాజయ్య.. ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన అధికారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపారు.

# బాలసదనములో పిల్లలకు పూర్తి సౌకర్యాలు





**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

జూన్ 28 మంచిర్యాల జిల్లా (హిందూస్థాన్ మీడియా)ప్రతినిధి :

బాలసదనములో పిల్లలకు అవసరమైన వసతి, భోజనం,ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాలసదనం భవనాన్ని మంచిర్యాల నియోజకవర్గ శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...మిషన్ వాత్సల్య పథకంలో 1 కోటి 34 లక్షల 93 వేల రూపాయల వ్యయంతో బాలసదనం భవన నిర్మాణం చేపట్టి అతి తక్కువ సమయంలో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. బాలసదనంలో 60 మంది పిల్లలకు అవసరమైన సౌకర్యాలు, ఫర్నిచర్,వసతి గదులు, మూత్రశాలలు ఇతరత్రా కల్పించడం జరిగిందని, వాచ్ మెన్, వంట మనిషి ఇతర సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. బాలసద నములో వసతి పొందుతూ అర్హత గల బాలికలను కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలకు పంపించి విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. బాల్యవివాహాల బాధితులు, లైంగిక వేధింపులకు గురైన పిల్లలు,అనాధలు, నిరాశ్రయులు,సంరక్షణ అవసరం ఉన్న పిల్లలకు సురక్షిత ఆశ్రయం కల్పించడం జరుగుతుందని తెలిపారు.సంరక్షణ, విద్య, వైద్య సేవలు, కౌన్సిలింగ్,పునరావాస సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ...అనాధలు, నిరుపేద పిల్లల సౌకర్యం కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో బాలసదనం ఏర్పాటు చేయడం జరిగిందని,పిల్లలకు ఎల్లప్పుడూ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారి పోషణ చూడడం జరుగుతుందని తెలిపారు. బాలికలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, బాలసదనం పిల్లలకు ఎంతగానో ఉపయోగప డుతుందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం అందరి సమిష్టి కృషితోనే సాధ్యపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ సమితి అధికారులు, బాలసదనం నిర్వాహకులు, సంబంధిత అధికారులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజమే.. మన అందరి లక్ష్యం

**-చుక్కల వేద్దాం పోలియో మహామ్మారిని పార ద్రోలుదాం.**
**-మున్సిపల్ చైర్మన్.. వైస్ చైర్మన్లు.. కౌన్సిలర్లు**
**-ప్రజా ప్రతినిధులు.. అధికారులు.. సర్పంచులు..**

జూన్ 28 ఖమ్మం (హిందూస్థాన్ మీడియా)

పోలియో రహిత సమాజమే.. మన అందరి లక్ష్యం...
చుక్కల వేద్దాం పోలియో
మహామ్మారిని పార ద్రోలుదాం.
మున్సిపల్ చైర్మన్.. వైస్ చైర్మన్లు.. కౌన్సిలర్లు
ప్రజా ప్రతినిధులు.. అధికారులు.. సర్పంచులు..
ఆదివారం పల్స్ పోలియో

ఈ సందర్భంగా వైరా మున్సిపాలిటీ కార్యాలయం నందు పల్స్ పోలియో కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ డాక్టర్ హర్ష తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ.. పల్స్ పోలియో పిల్లల జీవితానికి ఎంత అవసరమని ప్రతి ఒక్కరు చిన్న పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఆమె అన్నారు. అదేవిధంగా : 20వ వార్డులో అవార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు మాట్లాడుతూ.. ప్రతి ప్రతి చిన్నారికి తప్పకుండా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి, ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ఈ పోలియో చుక్కలు చాలా అవసరం, పిల్లల రక్షణ కోసం ప్రతిసారి పోలియో కార్యక్రమంలో ఐదు సంవత్సరాలు లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఆమె అన్నారు. 13వ వార్డులో గవర్నమెంట్ హాస్పిటల్ లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించిన 13వ వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి విజయలక్ష్మి సీతారాములు. ఈ సందర్భంగా విజయలక్ష్మి సీతారాములు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలియో నిర్మూలన కోసం నిర్వహిస్తున్న పోలియో చుక్కల కార్యక్రమాన్ని కచ్చితంగా చిన్న పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 7 కౌన్సిలర్ పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించిన..కౌన్సిలర్ పనితి సైదులు ఏడో వార్డులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని అవార్డు కౌన్సిలర్ పనిత సైదులు ప్రారంభించారు. చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను అనిత సైదులు వైద్య సిబ్బందితో కలిసి వేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లల అంగ వైకల్యానికి గురికాకుండా ఉండేందుకు ముందుగానే పోలియో చుక్కలు వేయించారని రెండు చుక్కలు నిండు జీవితానికి ఎంతో ఉపయోగమని సైదులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు అంగన్వాడీలు వైద్య సిబ్బంది మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.











# బిజినెస్

## ఫోక్స్‌వ్యాగన్‌లో భారీ కోతలు.. లక్ష మంది ఉద్యోగుల తొలగింపునకు ప్రణాళిక..?



జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్, తన చరిత్రలోనే అతిపెద్ద పునర్వ్యవస్థీకరణ చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా దాదాపు లక్ష ఉద్యోగాలను తొలగించడంతో పాటు, జర్మనీలోని పలు ఫ్యాక్టరీలను మూసివేయాలని, పెట్టుబడులను గణనీయంగా తగ్గించాలని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) ఆలివర్ బ్లూమ్ యోచిస్తున్నట్లు సమాచారం. 'మేనేజర్' మ్యాగజైన్ కథనం ప్రకారం, ఈ ప్రతిపాదనలకు కంపెనీ బోర్డు ఆమోదం లభించాల్సి ఉంది. రాబోయే ఐదేళ్లలో పెట్టుబడుల ప్రణాళికలో 15 శాతం కోత విధించి, మూలధన వ్యయాన్ని 130 బిలియన్ యూరోలకు తగ్గించాలని కంపెనీ భావిస్తోంది. అదే సమయంలో, ఫోక్స్‌వ్యాగన్ ప్యాసింజర్ కార్ల బ్రాండ్‌ను, దాని విడిభాగాల వ్యాపారాన్ని వేర్వేరు సంస్థలుగా విభజించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. కార్యకలాపాలను సులభతరం చేసి, సామర్థ్యాన్ని మెరుగుపరచడమే ఈ మార్పుల లక్ష్యం. అమెరికా టారిఫ్‌లు, చైనా ఎలక్ట్రిక్ వాహన తయారీదారుల నుంచి పెరుగుతున్న పోటీ, ఎలక్ట్రిక్ మొబిలిటీకి మారడంలో అవుతున్న అధిక వ్యయాలు వంటి సవాళ్లను ఎదుర్కోవడానికే ఈ మార్పులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. లాభదాయకతను పెంచుకోవాల్సిన అవసరం ఉందని సీఈఓ బ్లూమ్ గతంలో చాలాసార్లు స్పష్టం చేశారు. ఈ ప్రణాళికలు అమలైతే, ఫోక్స్‌వ్యాగన్‌కు చెందిన హానోవర్, జ్వికావు, ఎమ్డెన్ ప్లాంట్‌లతో పాటు ఆడికి చెందిన నెకార్సుల్మ్ ఫ్యాక్టరీలో కూడా ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉంది.

## కొత్త రంగుల్లో టీవీఎస్ ఎన్‌టార్క్ 125.. పండగ సీజన్‌లకు సిద్ధం

ప్రముఖ టూవీలర్ల తయారీ సంస్థ టీవీఎస్ మోటార్, రాబోయే వినాయక చవితి, దసరా పండగ సీజన్‌లను దృష్టిలో ఉంచుకుని తన పాపులర్ స్కూటర్ ఎన్‌టార్క్ 125 లైనప్‌ను రిఫ్రెష్ చేసింది. డిస్క్, రేస్ ఎడిషన్ వేరియంట్లలో సరికొత్త రంగులు, ఆకర్షణీయమైన గ్రాఫిక్స్‌తో మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ అప్‌డేట్ ద్వారా యువతను మరింతగా ఆకట్టుకోవాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త మార్పుల ప్రకారం, ఎన్‌టార్క్ 125 రేస్ ఎడిషన్ ఇప్పుడు డ్రిఫ్ట్ బ్లూ, ఇన్ఫెర్నో రెడ్, రష్ గ్రీన్ అనే మూడు కొత్త రంగులలో లభించనుంది. ఈ రంగులకు మ్యాచింగ్‌గా అలాయ్ వీల్స్‌ను కూడా అందిస్తుండటం విశేషం. ఇక డిస్క్ బ్రేక్ వేరియంట్‌లో మిడ్‌నైట్ బ్లాక్, స్పిటి వైట్ అనే కొత్త రంగులను జోడించారు. ఇప్పటికే ఉన్న నార్డో గ్రే రంగులో గ్రాఫిక్స్‌ను అప్‌డేట్ చేశారు. ఈసారి అన్ని ఎన్‌టార్క్ 125 వేరియంట్లలోనూ స్మార్ట్‌ఎక్స్‌కనెక్ట్ బ్లూటూత్ కనెక్టివిటీ, పూర్తి డిజిటల్ ఆర్ఎల్‌సీడీ ఇన్స్ట్రుమెంట్ కన్సోల్‌ను స్టాండర్డ్‌గా అందిస్తున్నట్లు టీవీఎస్ ప్రకటించింది. అయితే, ఇంజన్ పరంగా ఎలాంటి మార్పులు చేయలేదు. పాత మోడల్‌లో ఉన్న ఇంజన్, పనితీరు యథాతథంగా కొనసాగుతాయి. ఢిల్లీ ఎక్స్‌షోరూం ప్రకారం, డిస్క్ వేరియంట్ ధర రూ. 82,500గా, రేస్ ఎడిషన్ ధర రూ. 87,950గా నిర్ణయించారు. ఈ రిఫ్రెష్ చేసిన మోడళ్లు ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న టీవీఎస్ డీలర్‌షిప్‌లలో అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి.




## అదిరిపోయే అప్‌గ్రేడ్ తో హీరో ప్యాషన్ ప్లస్ బైక్

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్, దేశీయ మార్కెట్లో తన ప్రాచుర్యం పొందిన ఎంట్రీ-లెవల్ కమ్యూటర్ మోటార్‌సైకిల్ ప్యాషన్ ప్లస్‌లో సరికొత్త వేరియంట్‌ను విడుదల చేసింది. 'ప్యాషన్ ప్లస్ డిస్క్' పేరుతో వచ్చిన ఈ కొత్త మోడల్‌ను భద్రత, ఆధునిక ఫీచర్లను కోరుకునే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని తీసుకొచ్చారు. దీని ఎక్స్-షోరూమ్ ధరను (ఢిల్లీ) రూ. 84,128గా కంపెనీ నిర్ణయించింది.

**-ప్రధాన ఆకర్షణ.. ఫ్రంట్ డిస్క్ బ్రేక్**

ఈ కొత్త వేరియంట్‌లో అత్యంత ముఖ్యమైన మార్పు ఫ్రంట్ డిస్క్ బ్రేక్‌ను అమర్చడం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డ్రమ్ బ్రేక్ వెర్షన్‌తో పోలిస్తే, డిస్క్ బ్రేక్ మెరుగైన బ్రేకింగ్ పనితీరును, నియంత్రణను అందిస్తుంది. ముఖ్యంగా నగరాల్లోని రద్దీ ట్రాఫిక్‌లో ఆకస్మికంగా బ్రేకులు వేయాల్సి వచ్చినప్పుడు ఇది రైడర్ భద్రతను గణనీయంగా పెంచుతుంది. ఈ అప్‌గ్రేడ్‌తో కమ్యూటర్ విభాగంలో భద్రతకు హీరో ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది.

**-ఆధునిక ఫీచర్లు, ఇంజిన్ పనితీరు**

ఈ బైక్‌లో కేవలం బ్రేకింగ్ వ్యవస్థను మాత్రమే కాకుండా, పలు ఆధునిక ఫీచర్లను కూడా జోడించారు. రియల్ టైమ్ మైలేజ్ ఇండికేటర్, లో-ఫ్యూయల్ వార్నింగ్, సర్వీస్ రిమైండర్‌లతో పాటు బ్లూటూత్ కనెక్టివిటీతో కూడిన ఫుల్లీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను అందించారు. దీని ద్వారా రైడర్లు తమ స్మార్ట్‌ఫోన్‌కు వచ్చే కాల్/ఎస్ఎంఎస్ అలర్ట్‌లను నేరుగా క్లస్టర్‌పై చూడవచ్చు. దీంతోపాటు ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్, సైడ్-స్టాండ్ ఇంజిన్ కట్-ఆఫ్ సెన్సార్, యూఎస్‌బీ ఛార్జింగ్ పోర్ట్, యుటిలిటీ స్టోరేజ్ కంపార్ట్‌మెంట్ వంటివి కూడా ఉన్నాయి. ఇంజిన్ విషయంలో హీరో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇందులో అదే 100cc సింగిల్-సిలిండర్ ఇంజిన్‌ను కొనసాగించారు. ఈ ఇంజిన్ 8,000 rpm వద్ద 5.9 kW (దాదాపు 8 hp) శక్తిని, 6,000 తీజూఎ వద్ద 8.05 Nm టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంధన సామర్థ్యాన్ని పెంచేందుకు హీరో ఐ3ఎస్ (ఐడిల్ స్టాప్-స్టార్ట్ సిస్టమ్) టెక్నాలజీని ఇందులో పొందుపరిచారు. ఈ బైక్ లీటరుకు 71 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుందని కంపెనీ పేర్కొంది.



**-రంగులు మరియు డిజైన్**

కొత్త ప్యాషన్ ప్లస్ డిస్క్ వేరియంట్ నాలుగు ఆకర్షణీయమైన డ్యూయల్-టోన్ కలర్ ఆప్షన్లలో అందుబాటులో ఉంది. అవి: హెవీ గ్రే, నెక్సస్ బ్లూ, డార్క్ ఇండస్ట్రియల్ గ్రే, మరియు పెరల్ రెడ్. తక్కువ ధర, అధిక మైలేజీతో పాటు మెరుగైన భద్రత, ఆధునిక ఫీచర్లను కోరుకునే రోజువారీ ప్రయాణికులను ఈ కొత్త వేరియంట్ ఆకట్టుకుంటుందని హీరో మోటోకార్ప్ భావిస్తోంది.

## ప్రపంచ రోయింగ్ కప్: భారత్‌కు స్వర్ణం

ఇంటర్నెట్ డెస్క్:

భారత రోయింగ్ చరిత్రలో ఎన్నడూ లేని ఘనత నమోదైంది. స్విట్జర్లాండ్ వేదికగా జరుగుతున్న 2026 వరల్డ్ రోయింగ్ కప్-3లో భారత ఆర్మీకి చెందిన లక్ష్య, ఉజ్వల్ కుమార్ సింగ్ స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించారు. ప్రపంచ రోయింగ్ కప్ చరిత్రలోనే భారత్‌కు ఇది తొలి స్వర్ణం కావడం విశేషం. లైట్ వెయిట్ మెన్స్ డబుల్ స్కల్స్ ఫైనల్‌లో భారత్ జోడీ 6:26.09 నిమిషాల్లో రేస్‌ను పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. హాంకాంగ్ (6:27.14), నెదర్లాండ్స్ (6:27.36) తర్వాత స్థానాల్లో నిలిచాయి. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలో భారత జోడీ ఆధిక్యాన్ని నిలబెట్టుకుని చారిత్రక విజయాన్ని అందుకుంది.

**-భారత రోయింగ్‌లో కొత్త అధ్యాయం**

ప్రపంచ రోయింగ్ కప్ సిరీస్‌లో భారత్ ఇప్పటివరకు స్వర్ణ పతకం గెలవలేదు. ప్రపంచ రోయింగ్ ఛాంపియన్‌షిప్‌కు ముందు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ టోర్నీలో తొలి గోల్డ్ సాధించడం భారత రోయింగ్‌కు మైలురాయిగా నిలిచింది. ఈ విజయానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. స్వర్ణం సాధించిన లక్షయ్, ఉజ్వల్ ఇద్దరూ భారత ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న సైనికులే. ఈ టోర్నీలో పోటీపడుతున్న 18 మంది భారత బృందంలో 17 మంది ఆర్మీకి చెందిన వారే కావడం గమనార్హం. మరొకరు నేవీకి చెందిన అథ్లెట్. ఈ సీజన్‌లో వరల్డ్ రోయింగ్ కప్-1 విజేతలైన హాంకాంగ్‌కు చెందిన లామ్ సాన్ టుంగ్, చాన్ టిక్ లంగ్ జోడీతో పాటు ఇతర ప్రత్యర్థులను లక్షయ్-ఉజ్వల్ దీటుగా ఎదుర్కొన్నారు. ప్రారంభం నుంచే ఆధిక్యంలో కొనసాగిన భారత జోడీ ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొని గెలుపును సొంతం చేసుకుంది.

**-దేశానికి గర్వకారణం: ఆర్మీ**

ఈ విజయంపై ఆర్మీ రోయింగ్ నోడ్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రామకృష్ణన్ హర్షం వ్యక్తం చేశారు. 'భారత రోయింగ్ చరిత్రలో ఇది చిరస్మరణీయ ఘట్టం. వరల్డ్ రోయింగ్ కప్‌లో తొలి స్వర్ణ పతకం సాధించిన లక్షయ్, ఉజ్వల్ దేశ ప్రతిభను ప్రపంచానికి చాటారు. ఆర్మీ రోయింగ్ నోడ్‌లో సంవత్సరాలుగా అందించిన కఠిన శిక్షణ, క్రమశిక్షణకు ఇది నిదర్శనం. ఇది భారత ఆర్మీతో పాటు దేశానికే గర్వకారణం. ఈ విజయం మరెంతో మంది యువతను రోయింగ్‌వైపు ఆకర్షిస్తుందని, భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో భారత్‌కు మరిన్ని విజయాలు అందిస్తారని ఆశిస్తున్నాం" అని అన్నారు.




## వైస్ కెప్టెన్ అయినా జట్టులో చోటు గ్యారంటీ కాదు.. తిలక్ వర్మకు కైఫ్ వార్నింగ్

ఇంటర్నెట్ డెస్క్:

భారత జట్టు ప్రస్తుతం ఐర్లాండ్ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఆడిన తొలి మ్యాచ్‌లోనే పసికూన ఐర్లాండ్‌పై భారత్ 34 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్ తిలక్ వర్మకు మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ వార్నింగ్ ఇచ్చాడు. వైస్ కెప్టెన్ హోదాలో ఉన్నంత మాత్రాన జట్టులో స్థానం శాశ్వతం కాదని హెచ్చరించాడు. మంచి ప్రదర్శన చేయకపోతే ఎవరినైనా తప్పించే ధైర్యం టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఉందని స్పష్టం చేశాడు.తిలక్ వర్మ వైస్ కెప్టెన్ కావచ్చు. కానీ ఆ బాధ్యతల కారణంగా తుది జట్టులో స్థానం ఖాయం కాదు. గతంలో కూడా వైస్ కెప్టెన్లను జట్టు నుంచి తప్పించారు. ఆ బాధ్యతల వల్ల జట్టులో తన స్థానం సురక్షితమని తిలక్ భావిస్తే అది పెద్ద పొరపాటు అవుతుంది. ప్రతి మ్యాచ్‌లోనూ రాణించాల్సిందే. లేదంటే జట్టులో చోటు కోల్పోవాల్సి వస్తుంది. దీనికి అక్షర్ పటేల్ ప్రత్యక్ష ఉదాహరణ. అక్షర్ పటేల్ ఇటీవల ఫామ్‌ను ఆధారంగా చేసుకునే.. అతడి స్థానంలో తిలక్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ప్రతి ప్లేయర్ తమ ప్రదర్శనతోనే జట్టులో చోటు సంపాదించుకోవాలి' అని కైఫ్ స్పష్టం చేశాడు.

**-గంభీర్ కఠిన నిర్ణయాలు..**

'గౌతమ్ గంభీర్ భారత జట్టు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి టీమిండియాలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. భారత క్రికెట్‌లో ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడలేదు. స్టార్ ప్లేయర్లు కూడా ప్రతి మ్యాచ్‌లోనూ తమను తాము నిరూపించుకోవాల్సిందే. మేనేజ్‌మెంట్ ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి ఏమాత్రం వెనుకాడడం లేదు' అని కైఫ్ అన్నాడు. తొలి టీ20లో ఓటమి పాలైన టీమిండియా.. రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. నేడు బెల్‌ఫాస్ట్ వేదికగా ఐర్లాండ్-భారత జట్లు రెండో టీ20లో తలపడనున్నాయి. మరి పసికూన ఐర్లాండ్‌పై భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందా? అనేది చూడాల్సి ఉంది.



# స్పోర్ట్స్

## విరాట్‌తో కలిసి క్రికెట్ ఆడాలనుంది: టెన్నిస్ దిగ్గజం జకోవిచ్




ఇంటర్నెట్ డెస్క్:

వింబుల్డన్ 2026 టోర్నీకి ముందు సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీతో తనకున్న అనుబంధం గురించి వెల్లడించాడు. త్వరలోనే భారత్‌కు వస్తానని చెప్పాడు. అప్పుడు విరాట్‌ను కలిసి అతడితో క్రికెట్, టెన్నిస్ ఆడాలనే తన కోరికను నెరవేర్చుకుంటానని జకోవిచ్ వెల్లడించాడు. ఈ సందర్భంగా జకోవిచ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడాడు. విరాట్, నేను ఇప్పటివరకు ప్రత్యక్షంగా కలవలేదు. కానీ గత కొన్నేళ్లుగా మెసేజ్‌ల ద్వారా టచ్‌లో ఉన్నాం. సోషల్ మీడియాలో ఒకరినొకరం ఫాలో అవుతున్నాం. నేను క్రికెట్ చూడటానికి కారణం కూడా అతడే. త్వరలోనే విరాట్‌ను కలిసే అవకాశం వస్తుందని ఆశిస్తున్నా. అతడితో కలిసి టెన్నిస్, క్రికెట్ ఆడాలి. త్వరలోనే భారత పర్యటనకు వస్తా. అప్పుడు ఈ కోరిక నెరవేర్చుకుంటా' అని జకోవిచ్ వెల్లడించాడు.

**-25వ గ్రాండ్‌స్లామ్‌పై గురి..**

24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో చరిత్ర సృష్టించిన జకోవిచ్.. ఈ వింబుల్డన్‌లో తన 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేశాడు. ఇటీవల జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. దీంతో వింబుల్డన్‌లో బలంగా పునరాగమనం చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్నాడు. కాగా సోమవారం జరగనున్న తొలి రౌండ్‌లో చైనా ప్లేయర్ యిబింగ్‌తో జకోవిచ్ తలపడనున్నాడు. మరోవైపు ప్రపంచ నెంబర్ వన్ యానిక్ సినర్ కూడా టైటిల్ ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగుతున్నాడు. తొలి రౌండ్‌లో సెర్బియా ఆటగాడు మియోమిర్ కెక్మనోవిచ్‌తో అతడు పోటీ పడనున్నాడు. విజయం సాధించి టోర్నీని శుభారంభం చేయాలనే పట్టుదలతో సినర్ ఉన్నాడు.


# స్వీయ దర్శకత్వంలో రామ్ కొత్త సినిమా-నేడు ప్రారంభం

**-రేపు ప్రారంభం కానున్న రామ్ పోతినేని కొత్త చిత్రం #RAPO23**
**-ఈ సినిమాకు రామ్ స్వయంగా రచన, దర్శకత్వం**
**-సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న ఈ చిత్రం**
**-కృష్ణ పోతినేని నిర్మాతగా రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై నిర్మాణం**

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగానే కాకుండా ఇప్పుడు దర్శకుడిగా కూడా తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న కొత్త చిత్రం #RAPO23 గ్రాండ్ పూజా కార్యక్రమంతో అధికారికంగా ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. ఈ సినిమాకు రామ్ పోతినేని కేవలం హీరో, దర్శకుడే కాదు.. కథ కూడా ఆయనే అందిస్తుండటం విశేషం. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కనుంది. రామ్ పోతినేని సోదరుడు కృష్ణ పోతినేని 'రాపో సినిమాటిక్స్' అనే సొంత బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ తిరు ఈ చిత్రానికి కెమెరామెన్‌గా పనిచేయనున్నారు. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పూజా కార్యక్రమం ముగిసిన వెంటనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నటుడిగా ఎంతో క్రేజ్ సంపాదించుకున్న రామ్, దర్శకుడిగా ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో చూడా లని సినీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.



## శ్రీహరి తనయుడి 'స్టూడెంట్' టీజర్.. క్యాంపస్ పాలిటిక్స్‌తో అదరగొట్టిన మేఘాంశ్




దివంగత రియల్ స్టార్ శ్రీహరి వారసుడిగా సినీ రంగంలో నిలదొక్కుకు నేందుకు ప్రయత్నిస్తున్న యువ హీరో మేఘాంశ్ శ్రీహరి, తన కొత్త చిత్రం 'స్టూడెంట్' (#Student)తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. క్యాంపస్ రాజకీయాల నేపథ్యంలో సాగే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలతో నిండిన ఈ టీజర్, సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచింది. ఈ చిత్రంలో మేఘాంశ్ శ్రీహరి ఓ విద్యార్థి నాయకుడిగా ఇంటెన్స్ మాస్ లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నాడు.

## వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' రిలీజ్ డేట్ ఫిక్స్



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'ఆదర్శ కుటుంబం.. హౌస్ నెం.47 (ఏకే-47)'. ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా, ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్రబృందం కీలక ప్రకటన చేసింది. సినిమా విడుదల తేదీని అధికారికంగా ఖరారు చేస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. వెంకటేష్‌కు ఇది 77వ చిత్రం కావడం విశేషం. ఈ సినిమాలో ఆయన సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. 'ప్రతి కుటుంబం గుర్తుంచుకోవాల్సిన తేదీ' అనే క్యాప్షన్‌తో రిలీజ్ చేసిన పోస్టర్‌లో 'ఆదర్శ కుటుంబం' టైటిల్‌తో పాటు 'శాఖ 47' అని ట్యాగ్ తో సినిమాపై అంచనాలను పెంచేశారు. దీంతో ఇది క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉంటూనే, యాక్షన్ అంశాలు కూడా ఉంటాయనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తుండగా, రవి కె. చంద్రన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా, త్రివిక్రమ్ నుంచి చాన్నాళ్ల తర్వాత రాబోతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. 2024లో వచ్చిన 'గుంటూరు కారం' తర్వాత త్రివిక్రమ్ లాంగ్ గ్యాప్ తీసుకున్నారు. ఇప్పుడు 'ఆదర్శ కుటుంబం' తెరకెక్కిస్తున్నారు.

# నా భర్తకు చాలా మందితో ఎఫైర్లున్నాయి
# గోవిందాపై భార్య సునీత సంచలన వ్యాఖ్యలు!

**-లాకప్: సచ్ యా సజా' షోలో కంటెస్టెంట్‌గా సునీత అహూజా**
**-భర్త గోవిందాకు చాలా ఎఫైర్లు ఉన్నాయని సంచలన ఆరోపణలు**
**-గోవిందాలాంటి కొడుకు కావాలి కానీ, భర్త వద్దని వ్యాఖ్య**
**-ప్రేమలో ఉన్నప్పుడు అన్నింటినీ భరించాలని వ్యాఖ్యానించిన సునీత**
**-సునీత వ్యాఖ్యలు బాలీవుడ్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారిన వైనం**



ప్రముఖ బాలీవుడ్ నటుడు గోవిందా భార్య సునీత అహూజా, తన భర్త గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఆమె 'లాకప్: సచ్ యా సజా' అనే రియాలిటీ షోలో కంటెస్టెంట్‌గా పాల్గొంటున్నారు. షో ప్రీమియర్ ఎపిసోడ్‌లోనే తన వివాహ జీవితంలోని రహస్యాలను బయటపెట్టి, భర్త గోవిందాకు గతంలో పలువురితో ఎఫైర్లు ఉన్నాయని అంగీకరించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు బాలీవుడ్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. షోలో భాగంగా హోస్ట్ ఫరా ఖాన్, సునీత గురించి గతంలో వచ్చిన కొన్ని వార్తా కథనాల హెడ్‌లైన్స్‌ను చదివి వినిపించారు. అందులో "నాకు గోవిందాలాంటి కొడుకు కావాలి కానీ, భర్త కాదు" అనే హెడ్‌లైన్‌పై వివరణ ఇవ్వాలని కోరారు. దీనిపై సునీత స్పందిస్తూ, "ప్రేమలో ఉన్నప్పుడు అన్నీ భరించాలి. చి చి (గోవిందా ముద్దుపేరు) తన జీవితంలో ఎన్నో ఎఫైర్లు నడిపాడు. నిజానికి హీరో హీరోయిన్లకు ఇలాంటివి సాధారణమే. ఇన్నేళ్లుగా నేను చి చికి అండగా నిలబడ్డాను కాబట్టి, అతని లాంటి కొడుకు నాకు పుట్టాలని కోరుకుంటున్నాను" అని సునీత తన మనసులోని మాటను నిర్మొహమాటంగా చెప్పారు. ఆ తర్వాత సహ హోస్ట్ రితేశ్ దేశ్‌ముఖ్ మరో హెడ్‌లైన్‌ను చదివారు. "భార్యాభర్తలు కలిసున్నంత వరకు కళ్లతో కాల్చుకోవాలి. కానీ మూడో వ్యక్తి వస్తే మోకాళ్లపై కాల్చాలి" అనే హెడ్‌లైన్‌పై సునీత స్పందిస్తూ గోవిందాకు సరదాగా హెచ్చరిక జారీ చేశారు. "చి చి వింటున్నావా జాగ్రత్తగా విను. జీవితంలోకి ఎవరైనా మూడో వ్యక్తి వస్తే మోకాళ్లపైనే బుల్లెట్ తగులుతుంది. నేను అబద్ధం చెప్పడం లేదు" అని అన్నారు. గతంలో జరిగిన ఓ సంఘటన గురించి ప్రస్తావిస్తూ.. "ఆ సమయంలో నేను అసలు ముంబైలోనే లేను. చాలా మంది నేనే కాల్చానని అన్నారు. కానీ, నేను ఖాటు శ్యామ్‌లో ఉన్నాను" అని సునీత గుర్తుచేసుకున్నారు. గోవిందా, సునీత అహూజాల వివాహం 1987లో జరిగింది. అయితే, దాదాపు రెండేళ్ల పాటు వీరి పెళ్లి విషయాన్ని గోప్యంగా ఉంచారు. తమ కుమార్తె టీనా అహూజా పుట్టిన తర్వాతే వివాహ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ దంపతులకు యశవర్ధన్ అహూజా అనే కుమారుడు కూడా ఉన్నాడు. ఎన్నో ఏళ్లుగా ఆదర్శ దంపతులుగా పేరు తెచ్చుకున్న వీరి బంధంలో ఇన్ని చీకటి కోణాలు ఉన్నాయని సునీత స్వయంగా చెప్పడంతో బాలీవుడ్ షాక్‌కు గురైంది. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# 'లింగం' సిరీస్ రివ్యూ!

తమిళంలో తాజాగా రూపొందిన ఒక క్రైమ్ థ్రిల్లర్ ఇప్పుడు ఓటీటీ తెరపైకి వచ్చింది. మాఫియా నేపథ్యంలో సాగే ఆ సిరీస్ పేరే 'లింగం'. కథిర్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సిరీస్ కి, లక్ష్మీ శరవణ కుమార్ దర్శకత్వం వహించాడు. 8 ఎపిసోడ్స్ గా నిర్మితమైన ఈ సిరీస్, ఈ నెల 26వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. 'జియో హాట్ స్టార్' లో తమిళంతో పాటు ఇతర భాషల్లోను ఈ సిరీస్ అందుబాటులోకి వచ్చింది. 'కన్యాకుమారి'లో ఫిషింగ్ హార్బర్ ల చుట్టూ రాజకీయాలు నడుస్తూ ఉంటాయి. 'కడప్పురం' పరిధిలో చెల్ల పాండియన్, 'నాగర్ కోయిల్' పరిధిలో సామియప్పన్ చక్రం తిప్పుతుంటారు. ఒకరి ప్రాంతంపై ఒకరు పట్టు సాధించడం కోసం .. ఒకరి ఏరియాలో ఒకరు అక్రమ వ్యాపారాలు చేయడం కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతూ ఉంటాయి. ఇరువైపులా అనుచరులు శవాలుగా మారుతూ ఉంటారు. అదే ప్రాంతంలో ముత్తులింగం (కథిర్) తన తల్లితో కలిసి నివసిస్తూ ఉంటాడు. పోలీస్ ఆఫీసర్ కావాలనేది ఆయన ఉద్దేశం. స్పోర్ట్స్ కోటాలోనైనా జాబ్ కొట్టాలనే ఉద్దేశంతో, 'కబడ్డీ' ఆడుతూ ఉంటాడు. లింగంతో పోటీగా కబడ్డీ ఎవరూ ఆడలేరనే ఒక టాక్ ఆ ప్రాంతంలో వినిపిస్తూ ఉంటుంది. అతని ఆట తీరు .. నలుగురికీ సాయం చేసే మంచి మనసు చూసి, 'మలార్' (దివ్యభారతి) మనసు పారేసుకుంటుంది. వాళ్లిద్దరూ ప్రేమించుకుంటూ ఉంటారు. ఆ ఊర్లో ప్రతి ఏడాది జాతర సందర్భంలో కబడ్డీ పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంటుంది. ఆ సమయంలో ముఠా తగాదాలు జరగడం .. అనుచరులు చనిపోతుండటం జరుగుతుంటుంది. ఆ ఏడాది 'గుణశీలన్' అనే రౌడీని 'మార్టిన్' అనే రౌడీ హత్య చేస్తాడు. అయితే సరిగ్గా ఆ ప్రదేశంలో ముత్తులింగం ఉన్న కారణంగా, అతనే గుణశీలన్ ను హత్య చేసి ఉంటాడని అంతా భావిస్తారు. ఫలితంగా అతను కటకటాల పాలవుతాడు. అయితే 'చెల్లదురై' . 'తిరు' కారణంగా జైలు నుంచి బెయిల్ పై బయటికి వచ్చిన ముత్తులింగం, చెల్ల పాండియన్ దగ్గర ప్రధానమైన అనుచరుడిగా చేరతాడు. అటు పోలీసుల బారి నుంచి .. ఇటు గుణశీలన్ అనుచరుల నుంచి తప్పించుకోవడానికి అంతకు మించిన మార్గం లేదని అతను భావిస్తాడు. చెల్ల పాండియన్ కారణంగా ముత్తులింగం .. అతని వలన చెల్ల పాండియన్ ఎదుగుతూ ఉంటారు. దాంతో వాళ్లద్దరినీ అంతం చేస్తే, తన ఆస్తిలో సగం వాటాను ఇస్తానని సామియప్పన్ ప్రకటిస్తాడు. అప్పుడు ఏం జరుగుతుంది? ముత్తులింగం జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది? అనేది కథ. 1980 – 90ల మధ్య కాలంలో జరిగే కథ ఇది. రాజకీయాలు .. రౌడీయిజం .. ముఠా తగాదాల చుట్టూ తిరిగే కథ ఇది. హార్బర్ పై ఆధారపడినవారి జీవితాలతో కొంతమంది అక్రమార్కులు ఎలా ఆడుకుంటారనే అంశం ఇందులో మనకి ప్రధానంగా కనిపిస్తుంది. పోలీస్ ఆఫీసర్ కావాలనుకున్న ఒక యువకుడిని ఎలాంటి పరిస్థితులు నేరస్థుడిగా మార్చాయి. తాను తీసుకున్న నిర్ణయాలు అతని జీవితాన్ని ఎలా ప్రభావితం చేశాయి? అనే ఆసక్తికరమైన అంశాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ కథలో ఒక వైపున రాజకీయ నాయకులు .. వాళ్ల ప్రధానమైన అనుచరులు .. మరో వైపున పోలీస్ అధికారులు కనిపిస్తారు. ఈ మధ్యలోనే లింగం – మలార్ తో పాటు, తిరు – పద్మ లవ్ స్టోరీలు నడుస్తూ ఉంటాయి. అప్పుడప్పుడు ఈ ట్రాక్ ఉపశమనాన్ని కలిగిస్తూ ఉంటుంది. ముత్తు లింగం వైపు నుంచి మదర్ సెంటిమెంట్ .. లాయర్ చెల్లా దురై చెల్లెలు సత్య వైవు నుంచి చెల్లెలి సెంటిమెంట్ .. మలార్ వైపు నుంచి ఎమోషన్స్ తో కూడిన లవ్




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455